క్లుప్తంగా

ఆస్తిపన్నుపై రాయితీ

శాంతినగర్: ఈ నెల చివరి వరకు ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ నిత్యానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో గృహాలు, వ్యాపార సముదాయాల వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మానవపాడు: ఇటిక్యాల మండలంలోని షాబాద్‌లో బుధవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు తక్కెపల్లి రవీందర్‌రావు, చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే వీఎం అబ్రహం హాజరవుతారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ మండలాల చైర్మన్లు, పీఏసీఎస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహవీర్ జయంతి



అలంపూర్: జైనుల ఆరాధ్యదైవం 24వ తీర్థంకరుడు భగవాన్ మహవీర్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులో ఉన్న మహవీర్ ఆలయంలో జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తి సంధ్యా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నేడు జగ్జీవన్‌రాం జయంతి

గద్వాల రూరల్: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు దళిత ఐక్యవేదిక జిల్లా నాయకుడు మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు స్థానిక బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలకు చెందిన మేధావులు, ఉద్యోగులు, విద్యావంతులు, విద్యార్థులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మిస్సింగ్ కేసు నమోదు

గద్వాల క్రైం: వ్యక్తి అదృశ్యమైన ఘటనలో రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ఆనంద్ కథనం మేరకు గద్వాల మండలం అనంతపురం గ్రామానికి చెందిన ఎరుకలి పెద్ద ఎల్లప్ప మార్చి 21వ తేదీన ఇంటి నుంచి పని నిమిత్తం బయటి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి తిరిగిరాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం దక్కలేదు. దీంతో భార్య సరోజమ్మ ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్

శాంతినగర్: రంజాన్ ఉపవాస దీక్ష చేపడుతున్న ముస్లింలకు 12వ రోజు మంగళవారం రామచంద్రానగర్‌కు చెందిన వెల్డర్ నూర్‌బాషా స్వగృహంలోని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కనులపండువగా రాములోరి కల్యాణం



అమరచింత: ఆత్మకూర్ మండలంలోని వీరరాఘవపురంలో మంగళవారం సీతారాముల కల్యాణ మహోత్సం కనులపండువగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం త్రయోదశి రోజు గ్రామంలోని ఆలయంలో రాములోరి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట ఆలయంలో ఇదే రోజు రాములోరి కల్యాణం నిర్వహిస్తారని.. అదే ఆచారం ప్రకారం గ్రామంలో ప్రతి ఏడాది ఇదే రోజు నిర్వహిస్తామని సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటేశ్వర్, ఉప సర్పంచ్ శారద, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ చైర్మన్ మాధవి, ఆరెపల్లి సర్పంచ్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా గ్రామసభలు

- ప్రజల భాగస్వామ్యమేది..?
- అవగాహన కల్పించని అధికారులు



మద్దూరులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు(ఫైల్)

మానవపాడు: గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. కాని క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యం లేక గ్రామాలు అభివృద్ధి చెందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే నామమాత్రంగా గ్రామసభలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామసభల నిర్వహణ ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు గ్రామసభల్లో పాల్గొని సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్చిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల వివరాల నమోదు గ్రామసభల ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, పనులపై ప్రజల అభిప్రాయాలను ఈ సభల ద్వారానే తెలుస్తాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న గ్రామసభలు మండలంలో నామమాత్రంగానే సాగడం విశేషం.

గ్రామసభల నిర్వహణ ఇలా..

పంచాయతీతోపాటు అనుబంధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించే తేదీని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో టాంటాం(దండోరా) వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 18 శాఖల అధికారులు... జనాభాలో సుమారు 20 శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరుఅయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు నెలలకో సారి, సర్పంచ్‌లు, ప్రత్యేక అధికారులు పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కనీసం 50 మందితో గ్రామసభను ఏర్పాటు చేసుకోవాలని నిబంధనలు ఉన్న తూతూ మంత్రంగా గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీల ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపించాల్సిన ఉన్నా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆసక్తి చూపని గ్రామస్తులు

మండలంలోని చాలా గ్రామాలలో నిర్వహించే గ్రామసభలకు కనీసం పది మంది కుడా రావడం లేదు. ప్రజాప్రతినిధులు, మాజీలు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీలు మాత్రమే వస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి విషయంలో ప్రజలకు, నాయకులకు మధ్య అంతగా సమాచారం ఉండటం లేదు. గ్రామసభలో చర్చిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపితే గ్రామసభలకు ఆదరణ పెరిగే అవకాశం ఉంది. సమస్యలు పేరుకుపోవడం వలన సభలకు ఆదరణ తగ్గుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యం పెరగాలి

గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింతగా పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులు టాంటాం (దండోరా) వేయిస్తున్నాం. సమాచారం తెలుసుకున్న ప్రజలు స్వచ్ఛందంగా సభకు రావాలి. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుంది.

– రమణరావు, ఎంపీడీఓ, మానవపాడు

సమస్యలు పట్టించుకోవడం లేదు



గ్రామసభలో సమస్యలు పట్టించుకోవడం లేదు. రోజు రోజుకు పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. సభలో చర్చించిన అంశాలు పరిష్కారం కావడం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామస్తులు ఆసక్తి చూపకుండా సొంత పనుల్లో నిమగ్నమవుతున్నారు.

– సుధాకర్, చిన్నపోతులపాడు

పేరుకే గ్రామసభలు



గ్రామాలలో నిర్వహించే గ్రామసభలకు వార్డునంబర్లు, అధికారులు వెళ్లి సంతకాలు పూర్తి అయితే వెళ్దామా అన్నట్లు ఉంటుంది. సభలో సమస్యలు తెలుసుకోకుండానే ముగిస్తున్నారు. కనీసం గ్రామస్తుల అభిప్రాయాలను కూడా తీసుకోవడం లేదు. పేరుకు మాత్రమే గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

– కిరణ్, చెన్నిపాడు

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అంతకు ముందు గ్రామంలో సవారమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గట్టు తిమ్మప్ప, జంబురామన్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, సర్పంచ్ యాకోబు, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటన్న, ప్రహ్లాదరావు, నరేందర్, అజయ్, పరుష రాముడు, మధు, నారాయణ, నర్సింహులు, మల్దకల్, కిష్టన్న, ప్రభాకర్, తిమ్మరాజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ధరూరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అర్హులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నజీమున్నీసా బేగం, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, సంజీవ్, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీవ్వం



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ కేశవ్

గద్వాల రూరల్: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 24వార్డు హైమత్‌నగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి పైపులైన్ పనులు పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

కబ్జాదారులపై చర్యకు డిమాండ్



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పెబ్బేరు: మండలంలోని గుమ్మడం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ సువర్ణమ్మ, అఖిల పక్షం కన్వీనర్ మహేందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కురుమన్న గ్రామస్తులతో కలసి ధర్నా నిర్వహించడంతో పాటు గ్రామంలోని రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 197, 198 సర్వే నెంబర్‌లో గల గ్రామ కంఠం భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు గ్రామంలోని కొందరు వ్యక్తులపైన పట్టాలుగా మార్పిడి చేసి పాస్ పుస్తకాలు తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ పట్టాలను రద్దు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో హరిబాబు, చిన్నరాముడు, పెద్దలక్ష్మయ్య, నరసింహానాయుడు, చిన్న ఆంజనేయులు, వీరస్వామి, శాంతయ్య పాల్గొన్నారు.

విద్య, వైద్యం అమలులో ప్రభుత్వం విఫలం



కూలీలతో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

మల్దకల్: విద్య, వైద్యం అమలులో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆత్మగౌరవ పాదయాత్ర 19వ రోజు మల్దకల్, మద్దెలబండ, నేతువానిపల్లి, అడవిరావల్‌చెర్వు, ఉలిగేపల్లి, దాసరిపల్లి, బిజ్వారం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబ పాలనతో గద్వాల నియోజకవర్గం అభివృద్ధి చెందడంలేదని ఆరోపించారు. పింఛన్లు అందక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కాలంటే ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. మద్దెలబండలో వేరుశనగ పంటను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు మధుసూధనాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో చిట్టిబాబు, లవన్న, విష్ణు, గోపాల్, కిష్టన్న, బీసన్న, లక్ష్మన్న, రాముడు, నర్సన్న, రంగన్న, రామన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరిచేయాలని వినతి



గద్వాల రూరల్: తప్పులు సరిదిద్ది పాసుబుక్కులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టర్ వల్లూరు క్రాంతికి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్టు మండలం సల్కాపురం, పెంచికలపాడు గ్రామాలకు చెందిన 25 మంది రైతులకు 1997–98లో సర్వే నంబర్ 218లో 44 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. ఇందుకు సంబంధించి పట్టాలు, పాసుపుస్తకాలు ఇచ్చారు. అయితే ధరణి పోర్టల్ వచ్చిన తరువాత రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి వీరికి ఇచ్చిన భూములు రాయపురం శివారులోని సర్వే నంబరు 87, గట్టు శివారులోని సర్వే నంబరు 37లో ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. దీంతో రైతులు తమ భూములకు సంబంధించి సర్వేనంబర్లులో చోటుచేసుకున్న తప్పులను సరిదిద్ది నూతన పాసుబుక్కులు ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తప్పులు సరిదిద్ది రైతులకు నూతన పాసుబుక్కులు ఇవ్వాలని కోరారు.

కొనసాగుతున్న పది పరీక్షలు

శాంతినగర్: పట్టణంలో పది పరీక్షలు రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా కొనసాగాయి. హిందీ పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 270 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 269 మంది, రాఘవేంద్ర పాఠశాలలో 290 మంది విద్యార్థులకు 288 మంది, రవీంద్ర ఎయిడెడ్ పాఠశాల సెంటర్‌లో 161 మంది విద్యార్థులకు 160 మంది హాజరయ్యారు. 41 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు చీఫ్‌సూపరింటిండెంట్‌లు, మరో నలుగురు డిపార్ట్‌మెంటల్ అధికారుల పర్యవేక్షణలో హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

అలంపూర్: పదో తరగతి పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా కొనసాగాయి. పట్టణంలోని రెండు కేంద్రాల్లో విద్యార్థులు రెండవ రోజు పదవ తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం హిందీ పరీక్షలు రాయడం జరిగింది. హరిజనవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థులకు అందరు హాజరైనట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపారు. న్యూప్లాట్స్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 156 మంది విద్యార్థులకు అందరు హాజరైనట్లు పేర్కొన్నారు.

నర్సమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లుకు చెందిన నడిమింటి నర్సమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజనగరం రాజేష్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకుల బృందం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కల్యాణలక్ష్మి చెక్కు అందుకోవడానికి వచ్చిన నర్సమ్మ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు బీఆర్‌ఎస్ బాధ్యత వహించాలని సూచించారు. మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మ్యాతర్ల జగదీష్ మాదిగ, రాములు, వెంకట్రాములు, ఆంజనేయులు, మిద్దె కురుమూర్తి, చెన్నయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈవిషయమై జెడ్పీటీసీ కృష్ణయ్య రూ.10 వేల ఆర్థికసాయం చేశారని, ఎమ్మెల్యేతో మాట్లాడి మరింత సాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మృతురాలి మనుమడు వెంకటేశ్ విలేకర్లకు తెలిపారు.

బాలల చట్టాలపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

అలంపూర్ రూరల్: బాల్యం పిల్లల హక్కు అని వారిని స్వేచ్ఛాయుత వాతావరణంతో పెరిగేవిధంగా చూడాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహ అన్నారు. మంగళవారం మండలంలోని క్యాతూర్, లింగన్‌వాయి గ్రామాల్లో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలల హక్కులు, చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. క్యాతూర్‌లో బాల్య వివాహాల అరికడదామని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సెలర్ సురేష్ మాట్లాడుతూ బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి వివరించారు. ఈ చట్టం బాలబాలికలకు సమనమైన రక్షణ కల్పిస్తుందని అన్నారు. బాల్య వివాహం చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే 100 లేదా 1098కి ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జయమ్మ, ప్రకాష్, నవీన్, రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత

శాంతినగర్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. మంగళవారం వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్ ఎల్ఎస్ఆర్ కళాశాలలో పోషణ పక్ష అభియాన్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారులకు చిరుధాన్యాలతో కూడిన ఆహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యంగా ఉన్న చిన్నారులను, తల్లులను అభినందించి వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం మిల్లెట్స్‌తో తయారు చేసిన వంటకాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కరుణ, ఎల్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జయప్రకాష్‌రెడ్డి, రాజేందర్, కౌన్సిలర్ ధనలక్ష్మి, ఆయా గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు 26 మంది పాల్గొన్నారు.

నష్టపరిహారం త్వరగా అందేలా కృషి చేయండి

అయిజ: హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డిని మండల రైతులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం మంత్రి నివాసంలో కలిసి పలు సమస్యలను విన్నవించారు. భారతమాల నిర్మాణంలో భూమిని కోల్పోయిన రైతులకు నష్టపరిహారం త్వరగా అందేవిధంగా కృషి చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు బసయ్య, శీను, నారాయణ, నరసింహులు, రంజిత్, భాస్కర్, రాజు, నరసింహ పాల్గొన్నారు.

దుకాణ యజమానితో కొనుగోలుదారుడి వాగ్వాదం

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ దుకాణంలో ఇటీవల బైక్ మెకానిక్ రఫీ గడియారం కొనుగోలు చేశాడు. గడియారం సరిగ్గా పనిచేయడం లేదని మంగళవారం రాత్రి దుకాణ యజమాని రమేష్‌కు ఇచ్చాడు. మరమ్మతు చేసి గడియారం ఇవ్వగా కొద్ది సేపటికే మళ్లి పనిచేయడం లేదని దుకాణ యజమానితో రఫీ వాగ్వాదానికి దిగాడు. అదేసమయంలో ప్రార్థనలు ముగించుకుని బయటకు వచ్చి స్పోర్ట్స్ దుకాణం వద్ద జరుగుతున్న ఇరువురి వాగ్వాదాన్ని చూస్తూ అధిక సంఖ్యలో గుమిగూడారు. గమనించిన పోలీసులు దుకాణం వద్ద గుమిగూడిన జనాలను చెదరగొట్టారు. పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌షుకుర్, సిబ్బంది అక్కడికి చేరుకుని సమస్యను తెలుసుకొని శాంతింపజేశారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల న్యూటౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడారు. పెన్షన్ ఉద్యోగుల హక్కు అని పేర్కొన్నారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలో పాత పెన్షన్ సాధన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విష్ణు, రమేష్ కుమార్, బుచ్చన్న, నరసింహ, మురళీధర్‌రెడ్డి, ఎల్లస్వామి పాల్గొన్నారు.

సారూ.. రోడ్డును బాగు చేయించండి



ఏ.బూర్దిపాడులో ఉన్న మట్టి రోడ్డు

మానవపాడు: మండలంలోని పలు అభివృద్ధి పనుల పరిశీలనకు జిల్లా అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఎమ్మెల్యే వీఎం అబ్రహం మంగళవారం రాళ్లవాగు, రఘురామ ఎత్తిపోతల పథకం పరిశీలనకు వెళ్లారు. వివిధ గ్రామాలలో వారికి గుంతలమయంగా రోడ్లు దర్శనమిచ్చాయి. పలుమార్లు గుంతలమయంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని వేడుకున్నా పాలకులు, అధికారులు పట్టించుకోలేదని ఏ బూర్దిపాడు గ్రామస్తులు వాపోయారు. ఉన్నతాధికారులు వెళ్లే మార్గంలో కూడా గుంతలు పూడ్చకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం రోడ్లపక్కన చెత్తా చెదారం దర్శనం ఇచ్చినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సారూ మా గ్రామ రోడ్లకు మరమ్మతు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే క్షయ నివారణ



మదనాపురంలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

అమరచింత: అప్రమత్తంగా వ్యవహరించి తగిన ఆరోగ్య సూచనలు పాటించడంతో త్వరతగతిన క్షయ నుంచి కోలుకునే అవకాశం ఉందని డాక్టర్ శరత్ అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం పౌష్టికాహారం అందించారు. ఈమేరకు మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రతి నెల క్షయ వ్యాధిగ్రస్తులకు డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిసార్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా, జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన



అమరచింతలో..

మదనాపురం: తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం కళాజాతా బృందం ఆట పాటలతో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జన్ను పద్మావతి, సర్పంచ్ రాంనారాయణ, డాక్టర్ భవాని, ఆరోగ్య విస్తరణ అధికారులు రవీంద్రగౌడ్, ప్రమీల, సూపర్‌వైజర్ నర్మద, ఏఎన్ఎం విజయ్, ఆశా కార్యకర్తలు సుభాషిని, గౌరమ్మ, బృందం సభ్యులు పాల్గొన్నారు.